పోలీసు వెంకటస్వామి కథలు

# బాణామతి

**అపరాధ** పరిశోధనలో అమోఘమైన ప్రతిభ చూపించాననీ. దుర్భేద్య మనుకున్న పెద్ద పెద్ద కేసుల్ని సునాయాసంగా పట్టుకోగల చాకచక్యం ఉన్న వాడినన్న నా కీర్తి దిగంతాల వరకూ...అంటే హైదరాబాదులో ఉన్న పోలీసు ముఖ్య కార్యాలయం పరిధుల్లోకి వ్యాపించింది. అయితే. నా యశస్సు వెనుక మరో మహామనీషి వెంకటస్వామి ఉన్నాడన్న సత్యం అప్పటి మూలవిరాట్టుల కేం తెలుసు?

అస లీ విషయం ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే నా ప్రజ్ఞని ప్రభుత్వం అమాంతంగా గుర్తించి నన్ను రాష్ట్ర నేరపరిశోధన శాఖకి అధిపతిగా నియమించింది. అప్పుడే భాషా ప్రాతపదిక సూత్రప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. ఈ రాజకీయ పరిణామం వల్ల నాయకులు. వినాయకులు. ఉద్యోగులు. వివిధ రంగాల్లో విశిష్ట నైపుణ్యం గడించిన మహా వ్యక్తులే కాకుండా ఆగమ్యకాకులు. గూండాలు. హంతకులు. వంచకులు. చోరశిఖామణులు. తదితర నేరశాస్త్ర కోవిదులుకూడా తరలి వచ్చారు. ఒక పక్క హైదరాబాదు నగరం సర్వతోముఖంగా వృద్ధి అవుతుంటే. ఇంకో పక్క నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రజల్లో భయాందోళనలు. పత్రికల్లో నిశిత విమర్శలు! ఆంధ్రప్రాంతం నుంచి వచ్చిన ఉద్యోగులకి. తెలంగాణా సాంఘిక వాతావరణం. సంప్రదాయాలు సరిగా తెలియక పోవడం వల్ల నేరాలని అదుపు చేయలేక పోతున్నారనీ. నేర పరిశోధనలో విజయం సాధించలేకపోతున్నారనీ మొదట వ్యంగ్యంగానూ. తరవాత బాహాటంగానూ అనటం. అందువల్ల కించిత్తు మనస్తాపాలు కలగటం ఆ నాటి విషయం. పోలీసు వ్యవస్థ ప్రజల అభిమానం చూరగొనాలంటే ఈ రెండు రంగాల్లోనూ ఫలితాలు చూపించక తప్పదు. ఇది సాధించగల వ్యక్తిని నేనే అని మాబాజీ గారు ఆ భారాన్ని నా భుజస్కంధాలమీద పారేసి. తన బాధ్యత నిర్వర్తించానన్న గర్వంతో నెపోలియన్‌లా లేని మీసాలని దువ్వుకున్నాడు.

నేర పరిశోధక శాఖలో హత్యలని. దోపిడీలని. దొంగతనాలని. పెద్ద ఎత్తున జరిగే మోసాలని పరిశోధించటానికి ఆ యా రంగాల్లో ఆరితేరిన నిపుణులతో ప్రత్యేక విభాగాలు ఉండేవి. ఇవేకాక బాణామతి విభాగం అని ఒకటి ప్రత్యేకంగా ఉండేది. దాని తీరుతెన్నులు తెలుసుకుందామని ఇన్స్‌పెక్టరుకి కబురు పెట్టాను.

ఏవో కాగితాలు చూచుకుంటూ గదిలో ప్రవేశించిన వ్యక్తిని నేను చూడలేదు. తీరా చూస్తే తల తిరిగిపోయింది. వెంకటస్వామి! ఇది కలయా వైష్ణవ మాయయా అని కళ్ళు నులుపుకుని మళ్ళీ




ప్రొ॥ సూరత్తుం వేణుగోపాలరావు

రిని తీసుకుని వచ్చాను" అని పరిచయం చేసుకున్నాడు.

డాక్టరుగారు రామనాథంగారిని క్షుణ్ణంగా పరీక్ష చేసి పెదవి విరిచాడు. "మనం చేసేదేమీ లేదు. రాత్రి నిద్రలోనే ప్రాణం పోయింది."

"డాక్టరుగారూ! ఇది సహజమైన మరణమే అంటారా? గత రాత్రి వారి ఉపన్యాసం వింటుంటే చాలా ఆరోగ్యవంతుడిలాగే కనపడ్డారు. మృత్యువింత చేరికలో ఉంటుందని ఎవ రూహించగలరు?" అన్నాను.

"అనుమానానికి ఏ మాత్రం ఆస్కారం ఉన్నా నేను చెప్పనటండీ? రామనాథంగారికి దాదాపు డబ్బై ఏళ్ళ వయసైనా, మంచి ఆరోగ్య వంతుడనే చెప్పవచ్చు. కొంచెంగా డయబెటీస ఉంది కాని- ఆహార విషయంలో, మందులు వేసుకోవటంలో చాలా నియమంగా ఉండేవారు కాబట్టి అది కంట్రోల్ లోనే ఉందని చెప్పవచ్చు. ఈ మధ్య మెడనొప్పితో బాధ పడుతూ ఉంటే పడుకున్నప్పుడు తల కింద దిండు పెట్టుకోవడం మానివేయమని సలహా ఇచ్చాను. నా మాట ఆయనికి వేదవాక్యమంటే నమ్మండి."

"సహజ మరణమే కాబట్టి మేము చేసేదేముంది. అంత్యక్రియలకి ఏర్పాటు చేసుకోవచ్చు" అని అన్నాను.

వెంకటస్వామి ముందుకు వచ్చాడు. "దొరగారూ! నా దొక మనవి..."

పానకంలో పుడకలా వెంకటస్వామి రావల "ఏందేనా? ఇతడి సలహాలు తప్పవు కాబోలు అని అనుకుంటూ చిరాగ్గా చూచాను.

"అంత్యక్రియలకు ముందు శవాన్ని పోస్టుమార్టమ్ పరీక్షకు పంపించడం మంచిదేమో!" అని నసిగాడు.

డాక్టరుగారు అందుకుని-"అబ్బే! ఆ అవసరం లేదండీ. ఇది సహజ మరణమని నేను ఖండితంగా చెప్తున్నానుగా... అలాగే సర్టిఫికేట్‌కూడా ఇస్తాను" అన్నాడు.

రమేష్‌కూడా-"అనుమానం ఉంటేనే కదండీ పోస్టుమార్టమ్ పరీక్ష చేస్తారు? రామనాథంగారికి హాని చేసే వాళ్ళెవరండీ? మంత్రాలతో మనుషుల్ని మట్టు పెడతారంటే మీ లాంటి విద్యాధికులు కూడా నమ్ముతారా!" అని కటువుగా అన్నాడు.

తాబట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనే వెంకటస్వామి అంత తేలిగ్గా లొంగుతాడా? "బయట ప్రజలు బాణామతి ప్రయోగం అని గగ్గోలు పెడుతున్నారు. మనం పట్టించుకోకపోతే ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా వెళ్ళామని పైవాళ్ళు విరుచుకు పడతారేమో ఆలోచించండి" అని అన్నాడు.

ప్రజలు మూఢ విశ్వాసాలకి మనం లొంగిపోవల "ఏందేనా అని మధన పడ్డా, వెంకటస్వామి మాటలు కొంత సమంజసంగానే ఉండటం వల్ల, "సరే. అలాగే కానియ్యి" అని వచ్చేశాను.

xx xx xx

మర్నాడు పొద్దున్నే ఆఫీసుకు చేరీ చేరటంతో వెంకటస్వామి ప్రత్యక్ష మయ్యాడు. అంటే ఏదో ముఖ్య విషయం ఉందన్న మాట!

"ఇంకా నయం... రెండు నిమిషాలు ఆలస్యమై ఉంటే మీ రేదో మీటింగుకు వెళ్ళిపోయేవారు. తరవాత తమరిని పట్టుకోవటానికి నాకు తల ప్రాణం తోకకు వచ్చేది" అంటూ ఉపోద్ఘాతం మొదలు పెట్టారు.

"నన్ను పట్టుకోవటమేమిటి? ఏమిటి సంగతి?" అన్నాను విసుగ్గా.

"తమరు ఉన్నట్టుగా బయలుదేరి రావాలి. లేకపోతే కేసు మన చేయి దాటిపోతుంది."

"ఏ కేసు?"

"అదేనండి. రామనాథంగారి హత్య."

"హత్యా?" నేను నిశ్చేష్టుణ్ణయిపోయాను.

"అయ్యా! మనకి టైమ్ లేదు. అంతా విశదీకరిస్తాను. తమరు బయలుదేరండి. జీపూ, ఎస్కార్టు సిద్ధం చేశాను."

ఎక్కడికో, ఎందుకో తెలియకుండా బయలుదేరటం కొంచెం అభిమానానికి దెబ్బ అనిపించింది. దారిలో అడుగుదామంటే చుట్టూ మందీ మార్బలం. ఏది ఏమైనా, హత్య అనేసరికి నాలో ఉత్సాహం.

వెంకటస్వామి మల్కాజిగిరి రోడ్డు పట్టించాడు. ఆరో మైలు రాయి దగ్గర ఆపించి, అడ్డదారిన కొంత దూరం నడవగా చిన్న గుడి కనిపించింది. చుట్టుపక్కల కనుచూపుమేరలో మనుష్య సంచారం లేదు. లోపల అమ్మవారి విగ్రహం ముందు అర్చకుడు కళ్ళు మూసుకుని మంత్రాలు ఉచ్చరి


నూతన
యవ్వనం
పొందండి!
ఇతర చికిత్సలవలన ప్రయోజనము పొందక విసుగు చెందినవారు సంపూర్ణ సుఖము పొందుచున్నారు!
భారత ఆయుర్వేద వైద్యములో నిపుణత పొందిన
కవిరాజ్
డా॥ డి. హనుమంతరావు
(GOVT REGD)
సలహా ఫీజు 10॥రూ. ✱ మందుల ఖర్చులు ప్రత్యేకం.
సంప్రదించు వేళలు:
ఉదయం 8 నుండి 12 వరకు పగలు 3 నుండి 7 వరకు.
ఆదివారం: ఉదయం 8 నుండి 12 వరకు.

తపాలుద్వారా చిత్రకళ!


వర్ణం పూయు
చిత్రం చిత్రించ
వలయునా?
27 సంవత్సరములకుపైగా
తమ నమ్మకమునకును శక్తికిను పేరు పొందిన
సంతనుని
చిత్ర విద్యాలయము ద్వారా
తపాలుద్వారా తెలుగు, ఆంగ్లము, తమిళము, మళయాలం మొదలగు 5 భాషలలో ఇంటిలో ఉన్నట్లే తమ చిత్ర అనుభవమును శక్తిను ఉపయోగ పద్ధతిలో అభివృద్ధి చేయువచ్చు.
పూర్తి వివరములకు 90 పైసలు స్టాంపులతో మనవిచేయుము:-
Santhanu's Chitira Vidyalayam
Madras 600 002

స్తున్నాడు. అతని ముందు మైనంతో చేసిన ఒక చిన్న బొమ్మ-దాన్నిండా ముళ్ళు, సూదులు గుచ్చబడి ఉన్నాయి. ఇదే కాబోలు బాణామతి!

వెళ్ళీ వెళ్ళగానే వెంకటస్వామి హూంకరిస్తూ అర్చకుడి రెండు చేతులూ వెనక్కి విరిచి పట్టుకుని, "దుర్గాదాసూ! నీ దొంగ మంత్రాలు కట్టిపెట్టు. పండిత రామనాథంగారిని హత్య చేసినందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాము" అని అరిచాడు.

దుర్గాదాసు ఆశ్చర్యం అభినయిస్తూ- "ఇదేమి అన్యాయమండీ? ఈ మారుమూ ల అమ్మవారిని సేవించుకుంటూ బతికే నాకు, ఎక్కడో బషీర్‌బాగ్‌లో ఉన్న రామనాథంగారికి ఏమిటండీ సంబంధం?"

"రా స్కెల్! నీ కేమీ సంబంధం లేదా? వరండా మెట్లమీద నీ కాలి గుర్తులు, దిండుమీద నీ చేతి వేలి ముద్రలూ ఎలా వచ్చాయిరా?" అంటూ నాలుగు తగల నిచ్చాడు.

దానితో దుర్గాదాసు దారికి వచ్చాడు. "అయ్యా! నన్ను కొట్టకండి...నిజం చెపుతాను."

"ఇక్కడ కాదు. పోలీస స్టేషన్‌కి పద-అక్కడ చెబుదువు గాని" అంటూ బయటికి దారి తీశాను.

దుర్గాదాసు తన వాంగ్మూలంలో-అర్ధరాత్రి రామనాథంగారి తోటలో ప్రవేశించి, వరండాలో నిద్రపోతున్న ఆయన్ని, దిండుతో ఊపిరి సలవకుండా చేసి, హత్య చేశానని ఒప్పుకున్నాడు. తాను బాణామతి ప్రయోగంలో సిద్ధహస్తుడననీ, రామనాథంగారు బాణామతిని నిరసిస్తూ తన వ్యవహారాలకి అడ్డు వస్తూండటం వల్ల ఆయన్ని నిర్మూలిస్తే కాని లాభం లేదని ఆ నిశ్చయానికే వచ్చినట్లు చెప్పాడు. ఈ కార్యక్రమం పూర్తి చేయించి ఇంటికి చేరేసరికి రాత్రి పది గంటలయింది.

xx xx xx

మర్నాడు ఉదయం ఆఫీసుకు రాగానే స్వామికి కబురు చేశాను. మంచి హుషారుగా ఉన్నాడు.

"ఏమయ్యా! రాత్రి కేసు డైరీ తయారు చేశావా? ఆ వేలి ముద్రల కాపీలూ గట్రా ఇటు పట్టుకురా, నేను చూడాలి" అన్నాను.

"దొరగారు క్షమించాలి. వేలిముద్రలు, కాలి ముద్రలు ఏమీ లేవండి. వాణ్ణి బెదిరించాను. అంతే."

"ఏడిసినట్లే ఉంది. నిన్ను నమ్ముకుంటే కుక్క తోక పట్టినట్లే. రేపు కోర్టులో వాడు ఎదురు తిరిగితే ఎలాగ? సాక్ష్యం లేకుండా ఏ ముఖం పెట్టుకుని కోర్టుకు వెళ్దామనుకున్నావు. అని టికీ తొందరే."

"అయ్యగారు కోపంలో ఉన్నట్టున్నారు. నేను చెప్పేది పూర్తిగా వినండి: ఆ నాడు మీరు వెళ్ళిపోతూ చెప్పిన ప్రకారం శవాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి పంపించాక మామూ లుగా వాంగ్మూలాలు సేకరిస్తున్నప్పుడు-రామనాథంగారి అమ్మాయి రమేష్‌ని ప్రేమించిందని, రామనాథంగారు కూడా ఇష్టపడి వచ్చే మాసంలో వివాహం చేయటానికి నిశ్చయించుకున్నాడని; కాని, ఈ వ్యవహారం రమేష్ తండ్రికి ఏ మాత్రమూ ఇష్టంలేదనీ, నయాన భయాన చెప్పి చూచినా రమేష్ తన మొండి పట్టు వదలలేదని, ఆ విషయంలో రమేష్ తండ్రికీ-రామనాథంగారికి మాటా మాటా పెరిగిందని తెలిసింది."

"అంటే ఆ అమ్మాయి, రమేష్ ప్రేమించుకున్నందుకు రమేష్ తండ్రీ రామనాథంగారిని హత్య చేయించి ఉంటాడంటావు. అంతేనా. ఆ విషయం దుర్గాదాసు వాంగ్మూలంలో లేదే?"

"పాయింటుకు వస్తున్నాను, సార్! ఈ వాంగ్మూలాలు అన్నీ తీసుకునే సరికి రాత్రయింది. రమేష్ తండ్రిని కూడా ప్రశ్నిద్దామని ఆయన ఇంటికి వెళితే, ఆయన అప్పుడే కారెక్కి వెళ్తున్నాడు. టైముగానివేళ- ఇప్పుడెక్కడికి వెళ్తున్నా డబ్బా అని వెంబడించాను. ఆశ్చర్యమేమిటంటే నిన్న మనం జీపు ఆపిన చోటే ఆయన ఆగాడు. నా కేం అర్థం కాలేదు. గుట్టల్లోంచి, ముళ్ళ కంచెల్లోంచి తేలిగ్గా నడుచుకుంటూ గుడిలోకి వెళ్ళాడు. నేను కూడా వెనకాలే వెళ్ళి ఒక పక్క నక్కి కూర్చున్నాను. లోపల జరిగేది స్పష్టంగా కనబడింది, వినబడింది."

"ఏమైంది?"

"'దుర్గాదాసూ! ఎంత పని చేశావయ్యా? నీ బాణామతి విద్య ప్రయోగించి మాఅబ్బాయి మనసు మార్చమంటే ఆ ముసలాడిని చంపుతావా? రేపీ సంగతి బయటపడితే మన పని ఏమవుతుందో తెలుసా?' అన్నాడు రమేష్ తండ్రి.

దానికి దుర్గాదాసు-'నేను నా మంత్రశక్తితో చాలా ప్రయత్నం చేశాను. కాని, ఆ రామనాథం ఆంజనేయ ఉపాసకు డవటం వల్ల నా శక్తి అంతా బూడిదలో పోసిన పన్నీరైంది. అందుకని ఆలోచించి ఆ రామనాథం అడ్డు తొలగిస్తే కాని, లాభం లేదని రూఢి చేసుకొన్న తర్వాతే ఆ పని చేశాను. ఇక చూడండి. రేపు మళ్ళీ పూజ మొదలు పెడతాను. ఒక వారం లోపల మీ అబ్బాయి మీరు గీచిన గీటు దాటడు అని హామీ ఇస్తున్నాను' అన్నాడు. ఆ మాట వినంగానే చడీ చప్పుడు లేకుండా బయటికి వచ్చేశాను" అంటూ వెంకటస్వామి ఒక చిరునవ్వు పారేశాడు.

"అంతా బాగానే ఉంది కాని, ఫామిలీ డాక్టరు సహజ మరణమని నొక్కి చెప్తూ ఉంటే పోస్టుమార్టం పరీక్షకి పంపాలని పట్టుబట్టా వెందుకు? అసలు అనుమానం ఎందుకు వచ్చింది?" అని ఆశ్చర్యంగా అడిగాను.

"అంతా మీ చలవేనండి" అని చేతులు జోడించాడు.

'రామనాథం అంత్య క్రియలకు అర్డరు వేసిన వాడ్ని- నే నేదో ఆధారాలు చూపించావంటాడేమిటి? ఇతని ధోరణి ఎప్పుడూ ఇంతే' అనుకుంటూ, "అసలు సంగతి చెప్పు" అన్నాను.

"నేనూ మొదట మర్డరు అనుకోలేదండి. తమరు డాక్టరుగారితో మాట్లాడుతూ రామనాథంగారి ఆరోగ్య విషయం చర్చించకపోతే ఇందులో కూపీ లాగగలిగే వాళ్ళం కాదు. రామనాథంగారికి మెడ నొప్పని డాక్టరుగారు తలకింద దిండు వాడకూడదని చెప్పినట్లు విన్నాను. చూస్తే శవం తల కింద దిండు ఉంది. ఏదో అనుమానం వేసింది. ఆ సంగతి నలుగురి ముందూ చెప్పటం ఇష్టం లేక పోస్టుమార్టం పరీక్షకి మీ దగ్గిర అనుమతి తీసుకున్నాను.

ఆ తరవాత వాళ్ళమ్మాయికూడా ఆయన ఒక ఏడాది నుండీ దిండు వాడటం లేదని చెప్పింది. పరీక్షగా చూస్తే శవం ముఖంమీద రెండు మూడు నూలు పోగులు కనపడ్డాయి. నా అనుమానం బలపడింది. ఒకవేళ ఇది హత్యే అయితే దిండుతో మొఖంమీద ఒత్తి ఊపిరి సలవకుండా చేసుండచ్చా? అని ఆలోచించాను. అయితే, ఎవరు చేసి ఉంటారు అన్నది అంతు బట్టలేదు. వాంగ్మూలాలు అన్నీ పూర్తి చేసేటప్పటికి సుధామయి-రమేష్‌లు ప్రేమ కలాపం, రమేష్ తండ్రికి-రామనాథంగారికి మాటా మాటా రావటం బయటపడింది. ఆ తరవాత విషయం తమకు తెలిసిందే?"

"ఇంతకీ పోస్టుమార్టం చేసిన డాక్టరు ఏమన్నాడు?"

"ఇదిగోనండీ రిపోర్టు. దిండుతో ముఖంమీద వత్తి ఊపిరి సలపకుండా చేయటం వల్ల మెదడులోని రక్తనాళాలు చిట్లి మరణం సంభవించిందని వ్రాశాడు. దుర్గాదాసు తన వాంగ్మూలంలో అదే విధంగా హత్య చేశానని ఒపుకున్నాడు గదా!"

వెంకటస్వామిని ఎలా అభినందించాలో నాకు తెలీలేదు. "స్వామీ! మొత్తానికి నువ్వు ఘటికుడివయ్యా" అంటూ సంతోషంగా కరచాలనం చేశాను.

